


# శంభో తవారాధనం...

'వందే శంభు ముమాపతిం,
సురగురుం వందే జగత్కారణం
వందే పన్నగ భూషణం మృగ
ధరం వందే పశూనాం పతిం!
వందే సూర్య శశాంక వహ్నిన
యనం, వందే ముకుంద ప్రియం!
వందే భక్త జనాశ్రయంచ
వరదం, వందే శివం శంకరం!'

ఆ రోజు మాఘ కృష్ణ చతుర్దశి, మహాశివరాత్రి పర్వదినం. నందిగ్రామంలో శివాలయం భక్తజనులతో కిటకిటలాడుతున్నది. గర్భగుడిలో శివలింగానికి పంచామృతాలతో అభిషేకం జరుగుతున్నది. దుఃఖాన్ని దూరం చేసే పాలు, గుణవంతులు, తేజోవంతులైన సత్సంతానాన్ని ప్రసాదించే నెయ్యి, బుద్ధి వికాసం కలిగించే చక్కెర, అనారోగ్యాన్ని పరిహరించి ఆరోగ్యం ప్రసాదించే పెరుగు, శతృనాశనం కలిగించి రాజ్యలాభాన్నిప్రసాదించే నువ్వులనూనె, తేనె, చెరుకురసం, పరిమళ గంధ జలం మొదలైన. వాటితో రుద్ర నమక, చమకాలు పఠిస్తూ రుద్రాభిషేకం జరుపుతున్నారు అర్చకస్వాములు.


ఒక ప్రక్కగా నిలిచి చేతులు జోడించి, కన్నులర మోడ్చి ఏకాగ్రతతో ధ్యానిస్తున్నాడు శివవ్రతుడు. నుదుట విభూతి రేకలు, మెడలో స్ఫటికమాలల మధ్య దేదీప్యమానంగా వెలుగుతున్న చిన్న శివలింగం, ముంజేతికి ధరించిన రత్నకంకణంలో ప్రత్యేకంగా ప్రభలు వెదజల్లుతున్న శివలింగం పట్టు వస్త్రాలు ధరించిన ఆజానుబాహువు అయిన శివవ్రతుని వైపు తదేకంగా చూస్తూ నిలబడిపోయింది కాంచనమాల!

'ఎంతటి వర్చస్సు ఆ ముఖ మండలంలో చోటు చేసుకుందో! ఇంతకుముందెప్పుడూ చూసిన గుర్తు లేదు ఈ వ్యక్తిని ఈ పవిత్ర ప్రదేశంలో. ఆయన రూపమే కాదు ధరించిన ఆభరణాలు గూడా ప్రత్యేకంగానే వున్నాయి. ముఖ్యంగా ఆ ముంజేతికంకణంలో రత్నాల మధ్య దేదీప్యమానంగా శోభిస్తున్న ఆ శివలింగం వైపు అలాగే చూస్తూ వుండిపోవాలని పిస్తున్నది. ఆ కంకణం తన స్వంతమైతే ఎంత బాగుంటుంది' అనుకుంది మేలి ముసుగు చాటు నుండి దానివేపే చూస్తూ.

స్త్రీలమధ్య నిలిచి 'ఓం నమశ్శివాయ! ఓం నమశ్శివాయ' అంటున్నా, ఆమె చూపులు, మనస్సు మాత్రం గర్భగుడిలోని లింగం మీద కాక శివవ్రతుని ముంజేతికి వ్రేలాడుతున్న కంకణం మీదే నిలిచిపోయాయి.

"ఓం శ్రీ భవాయనమః, ఓం శ్రీ శర్వాయ నమః, ఓం శ్రీ ఈశానాయనమః ఓం శ్రీ పశుపతయేనమః, ఓం శ్రీ రుద్రాయనమః, ఓం శ్రీ ఉగ్రాయనమః, ఓం శ్రీ భీమాయనమః, ఓం శ్రీ మహతేనమః!"

-అంటూ శివాష్టకం జపిస్తున్నాడు శివవ్రతుడు. అభిషేకం, విభూదిలేపనం, రుద్రాక్ష ధారణ అనంతరం దివ్యంగా కానవస్తున్న శివలింగానికి బిల్వపత్రాలతో, వివిధ రకాల పుష్పాలతో శత నామావళి చదువుతూ అర్చన చేస్తున్నారు పూజారులు. శివ పూజకు అనర్హమైన మొగలి, సంపెంగ పువ్వులు తప్ప పద్మాలు, జాజి, గన్నేరు, శంఖపుష్పాలు, మందారాలు, నందివర్ధనాలు, మల్లెపూలు స్వామిపూజకు వినియోగపడి ధన్యమైనాయి.




డా.టి.కళ్యాణీ సచ్చిదానందం

బిల్వపత్రాలతో, పుష్పాలతో జరుగుతున్న పూజ చూస్తూ "జయ జయ మహాదేవ శంభోశంకర" అంటూ భక్తులు చేస్తున్న జయధ్వానాలు కాంచనమాల చెవికెక్కడమే లేదు.

'తనకా కంకణం కావాలి. దాన్ని ఎలాగైనా తన స్వంతం చేసుకోవాలి. ఎలా? ఎలా?' ఆలోచిస్తూ గుంపులో నుండి బయటకు నడుస్తుంటే ఆశ్చర్యపోతూ వెంట వెళ్లింది పరిచారిక.

"పూజ ఇంకా పూర్తి కాలేదు. హారతి తీసుకోకుండా వెళ్లిపోదామా దేవి?" అడిగింది.

ఎప్పుడూ అర్ధరాత్రి వరకు గుడిలోనే గడిపి లింగోద్భవ కాలానంతరం జరిగే అభిషేకార్చనలు చూసి, పురాణ కాలక్షేపానంతరం హారతి తీసుకుని తెలతెలవారుతుండగా ఇంటికి బయలుదేరడం అలవాటు కాంచనమాలకు. అందుకే ఆ వేళ ఆమె మధ్యలోనే లేవడం అచ్చెరువనిపించింది పరిచారిక వసంతికకు.



"అవును. ఎందుకో నా మనస్సు బాగాలేదు. శిరోభారంగా కూడా వుంది. అందుకే వెళుతున్నాను. నీవు మాత్రం ఇక్కడే వుండి నేను చెప్పినట్లు చేయి" అంటూ దగ్గరకు పిలిచి ఏం చేయాలో చెప్పి ఇంటికి వెళ్లిపోయింది కాంచనమాల!

☆ ☆ ☆

లింగోద్భవ సమయం రానే వచ్చింది. అర్ధరాత్రి సమయం-పరమశివుడు లింగ రూపంలో ఆవిర్భవించి సృష్టి ప్రారంభానికి శ్రీకారం చుట్టిన శుభసమయం!

సముద్ర మథన సమయంలో వెలువడ్డ హాలాహలాన్ని కంఠసీమలో బంధించి నీలకంఠుడు, గరళకంఠుడుగా ప్రస్తుతింపబడ్డ సమయం!

"భక్తులారా! వాతావరణాన్ని మలినం చేస్తూ, సృష్టి సర్వస్వాన్ని నశింపచేయడానికి వెలువడ్డ హాలాహల విష జ్వాలలను పానం చేసి లోకాలను పరిరక్షించిన మహాదేవుడికి కోటి కోటి ప్రణామాలర్పించారు దేవతలు!

మునిగణాలు, మానవులు ఆ రోజు ఉపవాస దీక్ష వహించి, రాత్రంతా జాగరణ చేస్తూ శివారాధనలో గడిపి ఆ స్వామి కృపకు పాత్రులు కావడం ఆ పురాణకాలం నుండి ఈనాటివరకు జరుగుతూనే వున్నది. ఇకపై కూడా అఖండంగా సాగుతూనే వుండగలదు. భక్త సులభుడు పరమశివుడు. ఆస్వామి భక్తుల ననుగ్రహించడానికి ద్వాదశ జ్యోతిర్లింగాల రూపంలో, పంచభూతత్వాలకు సంకేతంగా ఐదు పంచతత్వ లింగాల రూపంలో, మరెన్నో క్షేత్రాలలో లింగ రూపంలో వెలిసి వున్నాడు మర్త్యలోకంలో! స్వయం భూలింగాలు, ప్రతిష్ఠిత లింగాలు అసంఖ్యాకంగా వున్నాయి కర్మభూమియైన భారతదేశంలో. లింగరూపంలో పరమశివుని, సగుణరూపంలో శక్తిమాత పార్వతీదేవి సహితంగానూ పూజించడం వల్ల ఇహపర సౌఖ్యాలు లభిస్తాయి. మహాశివరాత్రి నాడు లింగరూపుడైన స్వామిని షోడశోపచారాలతో పూజించి, ఆ రోజంతా వుపవసించి, రాత్రి శివపురాణం వింటూ జాగరణ చేయడం వల్ల జన్మసార్థకమౌతుంది. ఇప్పుడు చెప్పబోయే మార్కండేయుని చరితం అందరూ ఏకాగ్రతతో వినాలని ప్రార్థిస్తున్నాను" అంటూ ఆలయం బయట

## అరుదైన ఏకముఖ శివలింగం



11వ శతాబ్దానికి చెందినదిగా చెప్పబడుతున్న ఈ ఏక ముఖశివలింగం 'జటామకుట ద్రావణం' కిందకి ప్రవహించే రీతిలో రూపొందింది. 65 సెంటీమీటర్ల ఎత్తు, 59 సెంటీమీటర్ల వెడల్పూ కలిగిన ఈ రాతి శివలింగానికి నుదుటి మధ్య భాగాన నిలువుగా మూడోకన్ను కనిపిస్తుంది. మెడలో మూడు వరుసల రుద్రాక్షమాలలు వరుసకు 108 చొప్పున వున్నాయి. శిఖలో చంద్రరేఖ కూడా మలచబడింది. శివలింగ క్రిందిభాగం నాలుగు దిక్కులకు ప్రతీకగా నాలుగు పలకలుగా వుంది. ఇదో అపురూపమైన శివలింగంగా ఖ్యాతికెక్కింది. ఇంత అద్భుతమైన శివలింగం అమెరికాలోని శాన్‌ఫ్రాన్సిస్కాలో 'ఏషియన్ ఆర్ట్ మ్యూజియం'లో దర్శనమివ్వడం మరింత విశేషం.

చేరి కూర్చున్న వారి నుద్దేశించి చెప్పి మార్కండేయుని వృత్తాంతం చదవసాగాడు ఆలయ పూజారి. వింటూ భక్తి పారవశ్యంలో మునిగిపోయాడు శివవ్రతుడు. తెల్లవారుఝామువరకు భక్త మార్కండేయుని చరితం విని, పునఃపూజానంతరం తీర్థప్రసాదాలు తీసుకుని భక్తిగా కళ్లకద్దుకుంటూ వెళుతున్నారు జనం.

“అయ్యా! నమస్కారం” పూజారితో ఏదో మాట్లాడుతున్న శివవ్రతుడు తనకు నమస్కరిస్తున్న ఆమె వైపు ప్రశ్నార్థకంగా చూస్తూ “నమస్కారం!” అన్నాడు తనూ చేతులు జోడిస్తూ.

ఆమె వైపు సాదరంగా చూస్తూ “నువ్వు మాత్రమే వచ్చావేమిటి వసంతికా! మీ దేవి రాలేదా?” అడిగాడు పూజారి.

“వచ్చి దర్శనం చేసుకుని త్వరగా వెళ్లిపోయారండి. నన్నిక్కడే వుండి వీరిని వెంటబెట్టుకు రమ్మని చెప్పారు. అయ్యా! తమరు నా వెంట వచ్చి మా దేవి గారి సత్కారం స్వీకరించాలని ప్రార్థిస్తున్నాను” అన్నది వసంతిక గౌరవపూర్వకంగా చూస్తూ.

“ఎవరామె? నన్నెందుకాహ్వానిస్తున్నది? మీకామె పరిచితురాలా?” పూజారివైపు కుతూహలంగా చూస్తూ ప్రశ్నించాడు శివవ్రతుడు.

“తెలుసు. నాకేకాక ఈ గ్రామ వాసులందరికీ ఎంతో ఆదరణీయురాలు. పేరు కాంచనమాల. వేశ్యాకులంలో పుట్టినా ఆ వృత్తికి కట్టుబడకుండా తన నాట్య గానాలతో అందరినీ రంజింపజేస్తుంది. ఆమె నాట్య గానాలను మెచ్చుకోని వారుండరు ఈ చుట్టుప్రక్కల ప్రాంతాలలో. అంతేగాక పూవుకు తావిలా ఆమె సౌందర్యానికి శివభక్తి మరింత వన్నెనిచ్చింది. నటరాజు సన్నిధిలో తనను తానే మరిచిపోయి ఆమె కావించే నాట్యం చూస్తే మీకే అర్థమౌతుంది నేను చెప్పింది అతిశయోక్తి కాదని! కానీ నాకు తెలిసినంతవరకు ఆమె ఇంతవరకూ ఎవరినీ ఈ విధంగా ఇంటికి ఆహ్వానించలేదు. మీరు అదృష్టవంతులు. ఈ గ్రామానికి వచ్చినరోజే ఆమె ఆతిథ్యం పొందే అవకాశం వచ్చింది. వెళ్లిరండి” అంటూ పూజారి చెప్పింది విని “అలాగా! అయితే తప్పక వెళ్లి చూస్తాను ఆమె నాట్యకళాకౌశలాన్ని” అన్నాడు శివవ్రతుడు.

☆ ☆ ☆


గుమ్మం దగ్గర నిలిచి ఆత్రంగా వీధివైపు చూస్తున్నది కాంచనమాల!

అల్లంతదూరంలో వసంతిక వెంట నింపాదిగా నడిచివస్తున్న వ్యక్తిని చూడగానే ఆమె కళ్లలో ఆనందం పొంగి వచ్చింది. తడబడే అడుగులతో ఎదురువెళ్లి మేలిముసుగు చాటు ముఖం మరుగుపరిచి “దయచేయండి ఆర్యా! మీ రాకతో మా గృహం పావనమైంది” అంటూ సాదరంగా ఆహ్వానించింది.

చిరునవ్వుతో చుట్టూ చూస్తూ లోపలకు వెళ్లాడు శివవ్రతుడు. విశాలమైన మంటపంలో మధ్యగా నిలువెత్తు నటరాజ విగ్రహానికి ఇరుప్రక్కలా వెలుగుతున్నాయి రెండు పెద్ద దీపస్తంభాలు! వీణ, మృదంగం వంటి వివిధ రకాల వాయిద్యాలు వరసగా అమర్చబడి వుండటంతో ఆమె నాట్యాగారంగా గ్రహించాడు. అంతలో కాళ్ల గజ్జెలు, ఘల్లు ఘల్లుమంటుండగా నడక నేర్చిన మెరుపుతీగలా వచ్చి అభినయపూర్వకంగా నమస్కరించి “ఆసీనులుకండి” అంటూ వున్నతాసనం మీద కూర్చున్న తని ముంజేతి నలంకరించి వున్న కంకణం వైపు చూస్తూ అలాగే వుండిపోయింది కొద్ది క్షణాల పాటు కాంచనమాల!

ఆమెవైపు ప్రసన్నంగా చూస్తూ “మీ గురించి పూజారిగారు చెప్పగా విన్నాను. నేను దూర ప్రాంతం నుండి వ్యాపారరీత్యా ఇక్కడకు నిన్ననే వచ్చాను. మహాశివరాత్రి పర్వదినం కావడంతో

## ఈశ్వరుడిచ్చిన స్పటికలింగం




శ్రీ శంకరభగవత్పాదులవారు (ఆది శంకరాచార్యులు) భారతదేశాన్ని యజ్ఞభూమిగా భావించి అందుకోసం వైదిక ధర్మ ప్రచారానికి నాలుగు దిక్కులా నాలుగు వేదాలకు ప్రతీకగా నాలుగు పీఠాల్ని శృంగేరీ, పూరీ, ద్వారక, బదరిలలో స్థాపించారు. శ్రీ శంకరాచార్యులవారు స్వహస్తాలతో స్థాపించిన యజుర్వేద ప్రధాన పీఠం శృంగేరీ శారదా పీఠము. ఈ పీఠం యొక్క విశిష్టత ఏంటంటే సాక్షాత్తు పరమశివుడే కైలాసం నుండి తెచ్చిన స్పటిక లింగమును శ్రీ శంకర భగవత్పాదులవారికి స్వహస్తాలతో అందచేశారట. ఆ స్పటిక లింగము పేరే చంద్రమౌళీశ్వరలింగము.

ఆది శంకరులవారికాలం నుంచి ప్రస్తుత పీఠాధిపతిగా వున్న 36వ పీఠాధిపతులు శ్రీ శ్రీ శ్రీ భారతీతీర్థ మహాస్వాముల వారి చేత కూడా ఈ కైలాస స్పటిక లింగము నేటికీ ప్రతిరోజూ పూజింపబడుతున్నది.



నేటికీ శృంగేరిలో పూజలందుకుంటున్న (పరమశివుడు కైలాసం నుండి తెచ్చి ఆది శంకరాచార్యులవారికిచ్చిన) స్పటిక లింగము.

శృంగేరీలో వున్న ఈ చంద్ర మౌళీశ్వర లింగానికి ప్రతిరోజూ సంప్రదాయ పద్ధతిలో త్రికాల పూజలు నిర్వహించబడుతున్నాయి. ఇక్కడ ప్రత్యేకత ఏంటంటే రాత్రి పూట ఈ చంద్రమౌళీశ్వర స్పటిక లింగానికి జరిగే విశేష పూజలని శృంగేరి శారదా పీఠాధీశులు శ్రీ శ్రీ శ్రీ భారతీతీర్థ మహాస్వాములవారు స్వహస్తాలతో ఇరవైఒక్కమంది వేద పండితులు నాలుగు వేదాలు చదువుతుండగా చేస్తారు. ఇటువంటి విశేష పూజలని ప్రతి ఒక్కరూ తప్పని సరిగా చూసి తరించవలసినదే. శృంగేరి శారదా పీఠము కర్నాటకలోని చిక్‌మగుళూరు జిల్లాలో పశ్చిమ కనుమలలో బెంగుళూరుకు 335 కి.మీల దూరంలో, షిమోగాకు 90కి.మీల దూరంలో వుంది. -పి.ఎస్

ఇక్కడ వెలసిన నందీశ్వర లింగాన్ని దర్శించి కృతార్థుడినైనాను. మీరు నన్ను ఆహ్వానించిన కారణం తెలుసుకోవచ్చా?" అంటూ ప్రశ్నించాడు శివవ్రతుడు.

"ఆర్యా! నేను చెప్పేది విని అన్యథా భావించకండి! మీ ముంజేతి రత్న కంకణం మధ్యలోని ఆ శివలింగం నా మనస్సు నాకట్టుకుంది. అది నాకు కావాలన్న కోరిక బలంగా నాటుకుంది హృదయంలో! అందుకే దాన్ని నాకు విక్రయించమని మిమ్మల్ని వేడుకోవటానికే ఇలా ఆహ్వానించే సాహసం చేసాను. దయచేసి దాన్ని నాకు ప్రసాదించండి. బదులుగా మీరు కోరినంత ధనాన్ని మీకు సమర్పించుకుంటాను!" అన్నది కాంచనమాల ప్రాధేయపూర్వకంగా చూస్తూ!

"ఈ కంకణమా! క్షమించు సుందరి. ఇది నాకెంతో ప్రియమైనది. దీన్ని అమ్మే వుద్దేశ్యం నాకెంతమాత్రం లేదు" దృఢంగా జవాబు చెప్పి వెళ్లడానికి వుద్యుక్తుడైనాడు శివవ్రతుడు.


"అలా అనకండి. మిమ్మల్ని ప్రాధేయపడుతున్నాను. దయచేసి నాకా కంకణాన్ని ప్రసాదించండి. దానికి బదులు ధనం కాక మీరేం కోరినా ఇవ్వడానికి సిద్ధంగా వున్నాను" దైన్యం, నిరాశ కదలాడుతున్న ఆమె కళ్లలోకి క్షణం సేపు సూటిగా చూసి "అయితే నీ తనువు, అనురాగం నా స్వంతం చేయమని అడిగితే అంగీకరిస్తావా? నీ వృత్తిధర్మం కూడా అదే గదా!" అన్నాడు శివవ్రతుడు.

ఒక్కక్షణం పాటు ఆ కోరిక విని అప్రతిభురాలైంది కాంచనమాల! వెంటనే సర్దుకుని "తప్పకుండ మీ కోరిక నెరవేరుస్తాను. నాకు కంకణాన్ని ప్రసాదించండి" అన్నది.

"నిరభ్యంతరంగా ఇస్తాను. ఇంద స్వీకరించు" వెంటనే కంకణాన్ని తీసి ఆమెకందించాడు శివవ్రతుడు.

అందుకుని కళ్లకద్దుకుని తన జన్మ ధన్యమైన అనుభూతి చెందింది కాంచన మాల. ఆమె అలౌకికానందానికి అంతరాయం కలిగింది చేతులు సాచి అతను తనను దగ్గరకు తీసుకోవడంతో. సిగ్గుతో ఎరుపెక్కిన ఆమె చెక్కిలి మీటుతూ "ఆ కంకణ స్పర్శతో అంతగా మైమరచిపోతున్నావే! మరి నా సంగతేమిటి? నీ ప్రేమానురాగాలు నాకు సంపూర్ణంగా లభించాలని ఆశిస్తున్నాను. నేనిక్కడ వుండేది మరో మూడు రోజులే! ఈ మూడు రోజులూ నీవు నా పత్నిలాగే మసలుకోవాలి సుమా! నాట్య ప్రదర్శనలు చేయడానికి నేనెంత మాత్రం అంగీకరించను" అన్నాడు.

"అలాగే స్వామీ! మనసా, వాచా మీరే నా పతిదేవులుగా భావిస్తున్నాను. ఇకపైనా నాట్యగానాలు మీ ఆనందం కోసమే!" అంటూ అతని పాదాలు భక్తితో కళ్లకద్దుకుంది.



ఆమెను లేవనెత్తి దగ్గరకు తీసుకోబోయాడు శివవ్రతుడు. అంతలో ఏదో కలకలం వినవచ్చింది. లోపల నుండి గంతులు వేస్తూ నల్లని వానరం, దాని వెంటనే రెక్కలు టపటపలాడిస్తూ తెల్లని కోడిపుంజు వచ్చి కాంచనమాల మీద పడ్డాయి.

దూరంగా జరిగి వాటివైపు తీక్షణంగా చూసిన శివవ్రతునికి నవ్వు తెరలు తెరలుగా తోసుకువచ్చింది. మంచి వస్త్రాలు ధరించి మెడలో రుద్రాక్ష మాలలు వ్రేలాడుతున్న వాటివైపుపరిహాసంగా చూస్తూ "వీటిని పెంచుకుంటున్నావా ఏమిటి? వింత అలంకరణలో వెలిగిపోతున్నాయి. పైగా మానవులలాగా రుద్రాక్షమాలలు వేసావేమిటి? వాటికి నీ శివభక్తి పంచి ఇవ్వాలనా?" అన్నాడు.

"నిజమే స్వామీ మీరన్నమాట. వీటిని నా కన్నబిడ్డలలా పెంచుకున్నాను. పరమశివుని అనుగ్రహం వాటికి లభించాలనే రుద్రాక్షధారణ కావించాను వాటికి. శివా, షణ్ముఖా! వారే మీ పితృదేవులు. నమస్కరించండి" అన్నది కాంచనమాల.

బుద్ధిగా వచ్చి తన పాదాలకు నమస్కరించిన వాటివైపు నవ్వుతూ చూసాడు శివవ్రతుడు. చిత్రంగా ఆయన హృదయంలోనూ వాటిమీద అనురాగం అంకురించింది.

'ఏమిటిది? ఎందుకిలా మాయామోహితుడైనాడు తను? భార్యా, పిల్లలు అనే భవబంధాలలో నన్ను బంధించివేస్తున్నావా పరమశివా!' అనుకుంటూ గుండెలపై రాసుకున్న అతని చేతికి తగిలింది మెడలోని హారంమధ్యలోని శివలింగం.

'కాంత సాంగత్యంలో ఈ పవిత్ర మాలాధారణ వుచితం కాదు' అనుకుంటూ మాలను తీసివేసాడు.

వానరాన్ని, కోడిపుంజును లాలించి నటరాజు సన్నిధిలో కట్టివేసి వచ్చింది కాంచనమాల!

"అవి మన మధ్యకు రావిక! పదండి! విశ్రాంతి తీసుకుందురుగాని!" అంటూ తన గదిలోకి తీసుకువెళ్లింది.

ఎన్నడూ లేనిది తమ యజమానురాలు పరపురుషుడిని స్వయంగా చేయి పట్టుకుని గదిలోకి తీసుకువెళ్లడం ఆశ్చర్యం, ఆనందం కలిగించాయి ఆమె పరిజనానికి.

'ఇకపై తన వృత్తిధర్మం స్వీకరించదానికి నిశ్చయించుకుందేమో! అందుకే మొదటి విటుడిని తానే రప్పించుకుంది ఇంటికి' అనుకున్నారు.

గదిలోకి వెళ్లాక తన కంఠహారాన్ని ఆమె దోసిట్లో వుంచాడు శివవ్రతుడు.

"నీవు కోరిన కంకణం నీ స్వంతమైంది. ఇప్పుడు నా ప్రాణప్రదంగా చూసుకుంటున్న ఈ స్ఫటిక లింగహారాన్ని నీకప్పగిస్తున్నాను. ఇంతవరకు ఎన్నడూ స్త్రీ సాన్నిధ్యాన్ని ఆశించని నేనిలా మూడురోజులు నీ చెంత గడపాలనుకోవడం ఆ విధి నిర్ణయం కావచ్చును. అందుకే పవిత్ర స్థలంలో దాన్ని వుంచి వెళ్లేటప్పుడు నాకు తిరిగి ఇవ్వవలసిందిగా కోరుతున్నాను. దానికే ప్రమాదం జరిగినా నేను సహించలేను సుమా!" అన్నాడు.

భక్తిపూర్వకంగా దాన్ని కళ్లకద్దుకుని అతనిపై. గౌరవాభిమానాలు ఇనుమడించిన హృదయంతో "అలాగే స్వామీ! దీన్ని జాగ్రత్తగా పవిత్ర స్థలంలో వుంచి క్షణంలో తిరిగి వస్తాను" అని నాట్య మందిరంలోకి వచ్చింది.

ఆమెను చూసి కిచకిచమంటూ శబ్దం చేసాయి వానరం, కోడిపుంజు, తమను విప్పి దగ్గరకు తీసుకుంటుందన్న భావంతో.

వాటివైపు ఆప్యాయంగా చూసి "మీతోపాటు ఈ మాల కూడా నటరాజు సన్నిధిలోనే జాగ్రత్తగా వుంచి వెళుతున్నాను. బుద్ధిగా వుంటారుగదూ!" అన్నది.

'పరమశివా! హేయమైన శారీరక సుఖాలకు దూరంగా వుండాలన్న నా ఆశయాన్ని మీ లింగం తాపిన కంకణంపై కలిగిన కోరిక భంగం అయ్యేలా చేసింది. అందుకే మూడురోజులు అతని పత్నిని కావడానికి అంగీకరించాను. నన్ను మన్నించండి' అనుకుని గిరుక్కున వెనుతిరిగింది.

ఆమె చేయి తగిలి ఒక దీప స్తంభం కొద్దిగా కదిలి వెలుగుతున్న వత్తి కిందపడటం ఆమె గమనించనే లేదు.

☆ ☆ ☆

"శాస్త్రిగారు! ఈ వార్త విన్నారా! కాంచనమాల నాట్యాగారం అగ్నిప్రమాదంలో దగ్ధమైపోయిందట పాపం"

"అవును రమణయ్యగారు! ఆమె ఇంటికి వెళ్లిన విటుడెవరో కూడా ఆ ప్రమాదం చూసి గుండెలవిసి మరణించాడుట! అందరూ అనుకుంటుంటే విన్నాను"

"అంతా విధికృతం! కానీ అంతకన్నా వింత వార్త అతనితో కాంచనమాల కూడా సహగమనానికి సిద్ధపడటం. అంతటి నాట్యకౌశలం గల ఆమె ఎందుకంతటి నిర్ణయం తీసుకుందో! వెళ్లి వారించుదాం పదండి" నందిగ్రామ వాసులందరూ మాట్లాడుకుంటూ కాంచనమాల ఇంటిని చేరుకున్నారు. అప్పటికే ఇంటిముందు చితి పేర్పించుకుని శివవ్రతుని మృతదేహంతోపాటు అగ్నిప్రవేశం చేయడానికి సిద్ధమౌతున్నది కాంచనమాల.

'హే! పరమేశ్వరా! అగ్నిప్రమాదంలో నా కారణంగా వానరం, కోడిపుంజు కాలి దగ్ధమైనాయి. వాటినక్కడ కట్టివేసి మహా పాపం ఒడికట్టుకున్నాను. నన్ను పత్నిగా వరించిన వ్యక్తి కూడా తన హారం భస్మీపటలమైందన్న వ్యథతో ప్రాణాలు కోల్పోయాడు. ఇంతటి అనర్థానికి కారణం నేనే గదా! నీ లింగాన్ని ఆశించడం నేను చేసిన తప్పిదమైతే దానికి శిక్ష తప్పక విధించు. ఇంత కాలం నాట్య గానాలతో నిన్నారాధించిన ఈ శరీరం నీ ఆరాధనకిక తగినది కాదు. అందుకే శంభో మహాదేవా! అగ్నిదగ్ధం కావిస్తున్నాను స్వీకరించు తండ్రీ! ఇదీ నీ ఆరాధగానే భావిస్తున్నాను' అనుకుంటూ కుమిలిపోతున్నది కాంచనమాల!

ఆమెను ఓదార్చడానికి ప్రయత్నించారు చుట్టూ చేరిన వాళ్లు!

"కాంచనమాల! ఏమిటీ మూర్ఖపు పట్టుదల? నీకేం తక్కువ? అందం, వయస్సు, అన్నిటినీ మించిన నాట్యకళాకౌశలం. వీటన్నిటినీ అగ్నికి ఆహుతి చేస్తావా? విధి నిర్ణయం అలా వుంది. దాన్ని కాదనడానికి గానీ, అందుకు బాధ్యత తీసుకోవడానికిగానీ నీకేం అధికారం వుందని భావిస్తున్నావు? మా మాట విను. అన్నిటినీ వదులుకుని మూర్ఖంగా ప్రాణత్యాగం చేయడానికి సిద్ధపడుతున్నావెందుకు? వేశ్యల జీవితంలోకి విటులురావడం, వెళ్లడం సహజమే! ఆయువు తీరి వెళ్లిపోయిన ఆ వ్యక్తిని భర్తగా అనుకోవడం మూర్ఖత్వం సుమా! మా మాట విను. ఆవేశం విడిచి శాంతంగా ఆలోచించు" అంటూ వారిస్తున్న వాళ్లనందరిని విదిలించుకుని "నన్ను వేశ్యగా భావించకండి. పంచభూతాల సాక్షిగా అతనినే నా భర్తగా అంగీకరించాను. అతను లేని జీవితం వ్యర్థం! వ్యర్థం!" అని పెద్దగా చెప్పి గభాలున చితిలోకి దూకేసింది కాంచనమాల.

అందరూ విభ్రాంతులై చూస్తుండగా మంటలు వువ్వెత్తున పైకి సాగాయి.

ఆ మంటలలో దగ్ధమౌతుందనుకున్న కాంచనమాల చెక్కుచెదరకుండా అలాగే నిలిచివుంది. అగ్నిజ్వాలలు శాంతించాయి. ఆశ్చర్యంతో నిలిచిన ఆమె కళ్లముందు ప్రత్యక్షమైనాడు పరమశివుడు.

"కాంచనమాల! నీ భక్తికి నేను పెట్టిన పరీక్షలో నెగ్గి అగ్నినే శీతలం కావించావు. పంకం (బురద)లో పుట్టిన పద్మం ఎంతో పవిత్రమై పూజా పుష్పమూ, లక్ష్మీదేవికి ఆవాసమూ అయినట్లే వేశ్యాకులంలో జన్మించినా నీ సౌశీల్యంతో స్త్రీజాతికి వన్నె చేకూర్చావు. నీ అభీష్టం తెలుపు, అనుగ్రహిస్తాను" అన్నాడు శాంత గంభీర స్వరంతో.

"హే! పరమేశ్వరా! నీ సాక్షాత్కార భాగ్యాన్నే పొందిన నాకింకే కోరికలూ లేవు. తండ్రీ! నాకు ముక్తిని ప్రసాదించు. నీలో ఐక్యం చేసుకో" అన్నది కాంచనమాల, ఆపాదమస్తకం భక్తిభావంతో పులకించిపోతూ!

"నీ కోరిక తప్పక తీరుతుంది. కొంతకాలం నీ వారితో సర్వశుభాలు పొంది, ఆ పైన కైలాస ప్రాప్తి పొందగలవు" అంటూ వరం ప్రసాదించి అదృశ్యుడైనాడు పరమశివుడు.

చితినుండి వెలికివచ్చిన కాంచనమాల పునర్జీవితులైన శివవ్రతుని, తన పెంపుడు వానరం, కోడిలను చూసుకుని స్వాంతన పొందింది. శేష జీవితం శివారాధనలో గడిపి ముక్తిని పొందారు ఆ పుణ్య దంపతులు. వానరం, కోడిపుంజు పరమశివుని అనుగ్రహంతో రాజపుత్రులుగా జన్మించి, రాజ్యభోగాలతోబాటు ధర్మబద్ధంగా రాజ్యపాలన గావించి చిరకీర్తులైనారు.

***ఓం శాంతిః శాంతిః శాంతిః*** ☆

## నెలరోజులే నీటినించి బయటకొచ్చే శివలింగం



**అవును ఇది నిజంగా నిజమే. ఈ విచిత్రమైన శివలింగాన్ని చూడాలంటే భక్తులు ముంబాయి వెళ్లాల్సిందే. ముంబాయి నుంచి సుమారు 100 కి.మీ.దూరంలోకల (అలీబాగ్, మహారాష్ట్ర) కిహిం‌మ్ బీచ్‌లో ఈ పరమశివుడు వున్నాడు. ఇక్కడవున్న ఈ మహిమాన్విత శివలింగం సంవత్సరంలో ఒకే సారి వచ్చే శ్రావణమాసంలో మాత్రమే నీటిలో నుంచి బయటకు వస్తుంది. అప్పుడే పూజలూ అన్నీనూ. ఇక్కడకు చేరాలంటే యన్.టీ.బస్‌లో కానీ, సముద్రమార్గంలో కానీ వెళ్లాలి. అభిషేక ప్రియుడైన శివుడు ఇలా ఎప్పుడూ నీటిలో వుంటున్నాడంటే ఆశ్చర్యంగా వుంది కదా!**